PUBLISHED AT :
RANGAREDDY
ప్రచురణ : రంగారెడ్డి
సంపుటి : 3
సంచిక : 110
తేది : 14-06-2026,
ఆదివారం
పేజీలు : 6 వెల రూ.4/-
Visit us : www.srujana.net

SRUJANA KRANTHI

# సృజన క్రాంతి

ప్రజల పక్షాన అక్షరకాంతి

ఎడిటర్ : శీలోజు యాదగిరి

ప్రకటనల కోసం సంప్రదించండి
రాధా పబ్లికేషన్స్
హైదరాబాద్
98495 68581
advt.srujanakranthi@ gmail.com
srujanakranti@ gmail.com

# హైదరాబాద్‌లో తొలి అడుగు వేసిన సక్షమ్

## బాధ్యతాయుతమైన ఫుడ్ సర్వీస్, హాస్పిటాలిటీ కార్యకలాపాలపై దృష్టి




**సృజనక్రాంతి/హైదరాబాద్ :** కార్యాచరణలో ఉత్తమత, బాధ్యతాయుత వృద్ధి, దీర్ఘకాలిక స్థిరత్వం నేడు దేశవ్యాప్తంగా ఫుడ్ సర్వీస్ మరియు హాస్పిటాలిటీ వ్యాపారాలకు కీలక ప్రాధాన్యతలుగా మారుతున్నాయి. భద్రత, అనుగుణత (కంప్లయన్స్), మరియు సుస్థిరతపై అవగాహన పెంపొందించాల్సిన అవసరాన్ని గుర్తించిన ఎలాన్‌ప్రో, హాస్పిటాలిటీ కన్సల్టెంట్స్ ఫోరమ్ (హెచ్‌సిఎఫ్) భాగస్వామ్యంతో హైదరాబాద్‌లో సక్షమ్ కార్యక్రమాన్ని నిర్వహించింది. పరిశ్రమలో జ్ఞాన మార్పిడి, పరస్పర చర్చలు, మరియు ఆచరణాత్మక చర్యలను ప్రోత్సహించే లక్ష్యంతో రూపొందించిన ఈ తొలి తరహా పరిశ్రమ వేదికకు విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమాన్ని ఆర్కిటెక్ట్ శ్రీనివాస మూర్తి, ఛైర్మన్, ఐజిబిసి హైదరాబాద్; ఎస్. వెంకట్ రెడ్డి, అధ్యక్షులు, తెలంగాణ స్టేట్ హోటల్స్ అసోసియేషన్; పి. శ్రావణ్ కుమార్, హాస్పిటాలిటీ కన్సల్టెంట్స్ ఫోరమ్; విశ్వనాథ్ పాండే, టిహెచ్ఐ కన్సల్టెంట్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 140 మందికి పైగా చెఫ్స్, హోటల్ ఇంజినీర్లు, రెస్టారెంట్ నిర్వాహకులు, ఫుడ్ బిజినెస్ యజమానులు, కన్సల్టెంట్లు, ఫుడ్ హ్యాండ్లర్లు, ఫెసిలిటీ మేనేజర్లు మరియు హాస్పిటాలిటీ రంగానికి చెందిన వ్యాపారవేత్తలు పాల్గొన్నారు. పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లు మరియు వాటికి ఆచరణాత్మక పరిష్కారాలపై చర్చించేందుకు ఈ వేదిక అవకాశాన్ని కల్పించింది. ఒకరోజు నిర్వహించిన ఈ సెమినార్ మూడు ప్రధాన అంశాలపై కేంద్రీకృతమైంది – భద్రత, పరిశుభ్రత, కంప్లయన్స్, ఆడిట్ సిద్ధత, సుస్థిరత. ఎల్‌పిజి భద్రత, వంటగది వెంటిలేషన్, అగ్నిమాపక భద్రత, ఫైర్ సప్రెషన్ టెక్నాలజీలు, ఆహార భద్రతా నిబంధనలు, గ్యాస్ సామర్థ్యం ద్వారా సుస్థిరత, నెట్–జీరో ఆలోచన, హాస్పిటాలిటీ రంగంలో గ్రీన్ బిల్డింగ్ విధానాల పాత్ర వంటి అంశాలపై నిపుణులు సవివరంగా చర్చించారు. వాణిజ్య వంటగదులు, ఫుడ్ సర్వీస్ సంస్థల్లో తరచుగా కనిపించని కార్యాచరణ పరమైన ప్రమాదాలు, వాటి ప్రభావం భద్రత, కంప్లయన్స్ మరియు వ్యాపార నిరంతరతపై ఎలా ఉంటుందో కూడా విశ్లేషించారు. పాల్గొన్నవారు నియంత్రణా ప్రమాణాల అనుసరణ, రిస్క్ మేనేజ్‌మెంట్, వనరుల సమర్థ వినియోగం, మరియు వ్యాపార నిరంతరతపై విలువైన అవగాహనను పొందడంతో పాటు, హాస్పిటాలిటీ కార్యకలాపాల్లో బాధ్యతాయుత విధానాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆహార భద్రత, సుస్థిరత, గ్యాస్ భద్రత, కిచెన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, హాస్పిటాలిటీ కార్యకలాపాలు, కంప్లయన్స్ రంగాలకు చెందిన ప్రముఖ నిపుణులు పాల్గొన్నారు. వీరిలో ఆర్కిటెక్ట్ శ్రీనివాస మూర్తి (ఐజిబిసి హైదరాబాద్), అన్మోల్ ప్రభు (రేవాక్ చెఫ్‌మేట్), స్వప్నిల్ దేశ్‌పాండే (స్వస్తిక్ సినర్జీ), అశ్విన్ మెనన్ (గ్యాస్ విజిల్ టెక్నాలజీస్), ప్రొఫెసర్ సురేంద్ర కుమార్ సూద్, జెసల్ సంపత్ (పుణే గ్యాస్), డాక్టర్ అంజనేయులు చాగంటి (ఫుడ్ సేఫ్టీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్), పి. శ్రావణ్ కుమార్ (స్థాపక అధ్యక్షులు, హెచ్‌సిఎఫ్) ఉన్నారు.

ఈ సందర్భంగా సంజయ్ జైన్, డైరెక్టర్, ఎలాన్‌ప్రో మాట్లాడుతూ, "హైదరాబాద్ దేశంలోని అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఫుడ్ మరియు హాస్పిటాలిటీ మార్కెట్లలో ఒకటిగా ఎదుగుతోంది. రెస్టారెంట్లు, హోటళ్లు, క్లౌడ్ కిచెన్లు , వ్యవస్థీకృత ఫుడ్ రిటైల్ రంగాలు వేగంగా విస్తరిస్తున్నాయి. ఈ వృద్ధి కొనసాగుతున్న తరుణంలో, వ్యాపార విస్తరణతో పాటు బలమైన కార్యాచరణ వ్యవస్థలను కూడా నిర్మించాల్సిన అవసరం ఉంది. పరిశ్రమకు సంబంధించిన నిపుణుల జ్ఞానాన్ని అందించడంతో పాటు, సంస్థలు తమ రోజువారీ కార్యకలాపాలను, దీర్ఘకాలిక వ్యాపార పనితీరును మెరుగుపరచుకునేందుకు సక్షమ్ ఒక వేదికగా నిలుస్తుంది." అని అన్నారు. ఈ ఏడాది కార్యక్రమంలో మరో ముఖ్యమైన అంశం సక్షమ్ వేదికను చర్చల స్థాయి నుంచి ఆచరణాత్మక అమలు దశకు తీసుకెళ్లడం. ఇందులో పాల్గొన్న సంస్థలకు భద్రత, కంప్లయన్స్ లేదా సుస్థిరతకు సంబంధించిన అంశాలపై ఒకసారి నిర్వహించే డయాగ్నస్టిక్ ఆడిట్‌తో పాటు నిపుణుల సలహా సేవలు అందుబాటులోకి తీసుకురానున్నారు. అనుభవజ్ఞులైన నిపుణుల ద్వారా నిర్వహించబడే ఈ అంచనాలు సంస్థల ప్రస్తుత విధానాలను సమీక్షించి, ముఖ్యమైన రిస్క్ ప్రాంతాలను గుర్తించి, మెరుగుదలకు అవసరమైన ఆచరణాత్మక సూచనలను అందిస్తాయి. ఢిల్లీ, పుణే, బెంగళూరులో విజయవంతంగా నిర్వహించిన తర్వాత, హైదరాబాద్ అధ్యాయం సక్షమ్‌ను జాతీయ స్థాయి పరిశ్రమ వేదికగా మరింత విస్తరించడంలో మరో ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. నిపుణుల సలహా సేవలు, డయాగ్నస్టిక్ ఆడిట్లను ప్రవేశపెట్టడం ద్వారా, సక్షమ్ ఇప్పుడు కేవలం జ్ఞాన మార్పిడికే పరిమితం కాకుండా, సంస్థల స్థాయిలో కొలిచగలిగే మెరుగుదలలను సాధించడంపై దృష్టి సారిస్తోంది.



# బాలికల హాస్టల్‌ను తనిఖీ చేసిన ఎంపీడీఓ

సృజన క్రాంతి/యాదాద్రి భువనగిరి ప్రతినిధి : వలిగొండ మండల కేంద్రంలో లోతుకుంట హాస్టల్‌ను బుధవారం రోజు మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. జలందర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో నిర్వహిస్తున్న వివిధ రిజిస్టర్లను పరిశీలించి వాటి నిర్వహణపై ఆరా తీశారు. అలాగే హాస్టల్ ప్రాంగణంలోని పరిశుభ్రత, స్టోర్ రూములు, తరగతి గదులు, ఇతర మౌలిక వసతులను పరిశీలించి సంబంధిత అధికారులకు అవసర మైన సూచనలు అందించారు. హాస్టల్‌లో ఇటీవల చేరిన కొత్త విద్యార్థినులతో ప్రత్యేకంగా మాట్లాడి వారి విద్యాభ్యాసం గురించి తెలుసుకున్నారు. విద్యార్థినులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని ప్రోత్సహించారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుంటే జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

సృజన కళా విజ్ఞాన వేదిక

# మృత్యుంజయుడు బొల్లిముంత శివరామకృష్ణ





– డా.టేకుమళ్ళ వెంకటప్పయ్య (9490400858)

సాహిత్యరంగంలోని అవకాశవాదాన్ని, తిరోగమన విధానాలను నిర్ద్వంద్వంగా ఖండించిన బొల్లిముంత శివరామకృష్ణయ్య నేటి తరానికి స్ఫూర్తిదాయకం. ఉపాధ్యాయుడిగా, ఉద్యమకారుడిగా, అరసం నేతగా, కమ్యూనిస్టు కార్యకర్తగా, నవలారచయితగా, సినీరచయితగా బహుముఖీనమైన ప్రతిభను కనరపరచిన బొల్లిముంత శివరామకృష్ణ సాహిత్య ప్రపంచంలో ఒక "మృత్యుంజయుడు" గా భావిస్తారు. తెలుగు సాహితీలోకంలో ఆయన ఒక నిశ్శబ్ద విప్లవం, "మార్క్సిస్టు గాంధీ" అని కూడా ఆయనను పిలవడం ఉంది.

గుంటూరు జిల్లా చదలవాడలో అక్కయ్య, మంగమ్మ దంపతులకు 1920సం, 27 నవంబర్ జన్మించిన శివరామకృష్ణ, తండ్రి చదలవాడలో స్థాపించిన పాఠశాలలోనే ఉపాధ్యాయవృత్తి ఆరంభించారు. కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి, త్రిపురనేని గోపీచంద్‌తో పరిచయాలు, జస్టిస్ పార్టీతో సన్నిహిత సంబంధాలుండేవి. త్రిపురనేని రామస్వామి చౌదరి పద్యకవిత్వం రాస్తూ ఉండేవారు. బొల్లిముంత, గోపీచంద్ లాంటి కుర్రాళ్లంతా ఆయనకు శిష్యులైపోయి ఆయనలాగా పద్యకవిత్వం రాయాలని ఉబలాటపడేవాళ్లు. వీళ్ల కవిత్వాన్ని ఆయన సరిచేసి సూచనలిస్తూ ఉండేవారు. అలా ఉన్నరోజుల్లో... గోపీచంద్ కథలు రాసి పేరు తెచ్చుకోవడం గమనించిన శివరామకృష్ణ తనూ కథలు రాయాలని నిశ్చయించుకున్నారు. 1936 సం.లో మద్రాసు నుండి వచ్చే 'చిత్రాంగి' పత్రికలో తొలి కథ 'ఏటొడ్డు' ముద్రణ జరిగే సమయానికి వారి వయసు కేవలం పదహారు సంవత్సరాలు మాత్రమే!

1945 సం.లో ఉపాధ్యాయవృత్తిని వదలిపెట్టి వ్యవసాయ కార్మికసంఘంలో చేరి చల్లపల్లిరాజాకి వ్యతిరేకంగా సాగిన భూపోరాటంలో పాల్గొన్నారు. ఆ పోరాట అనుభవాలతోనే తొలి రాజకీయనవల "మృత్యుంజయులు" రాశారు. కొంతకాలం "నగారా" అనే పత్రిక నడిపారు. ప్రముఖ రచయత కొడవటిగంటి కుటుంబరావు రాసిన 'పిల్లి' అనే కథానికపై బొల్లిముంత చేసిన విమర్శ 'కొడవటిగంటి తిరోగమన యాత్ర' అప్పట్లో ఒక సంచలనం. పిల్లి "మ్యావ్" అన్నంత మాత్రాన అది 'మావో' అన్నట్లు కాదని, పిల్లి విప్లవానికి ప్రతీక కాదని బొల్లిముంత తేల్చిపడేశారు. బెంగాల్ కరవుపై బుర్రకథ, రైతుబిడ్డ హరికథ, సూక్ష్మంలో మోక్షం, అంతరాత్మ అంత్యక్రియలు, శివరామకృష్ణ కథలు, ఏ ఎండకాగొడుగు, పత్రికా న్యాయం, తెలంగాణా స్వతంత్రఘోష, క్విట్ కాశ్మీర్, ధర్మసంస్థాపనార్థాయ లాంటి అద్భుతమైన నాటికలు రచించారు. రాజకీయ గయోపాఖ్యానం, రాజకీయ కురుక్షేత్రం వంటి పద్యనాటకాలు కూడా రాశారు. దొంగ దొరికింది, భలేమంచి చౌకబేరం వంటి రేడియో నాటికలు కూడా ఆయనవే! ప్రజానాట్యమండలి పునరుద్ధరణ సమయంలో బొల్లిముంత శ్రీకాంత్‌తో కలసి అందరూ బతకాలి నాటకం రాశారు. దీన్ని రక్తకన్నీరు నాగభూషణం వందకు పైగా ప్రదర్శనలిచ్చారు. బొల్లిముంత శివరామకృష్ణ మేనల్లుడు డాక్టర్ చందు సుబ్బారావు "శివరామకృష్ణ పండితుడు కాదు, మహాకవి కాదు, మహోపాధ్యాయుడు కాదు. అలా ఎవరైనా అంటే ఆయన విరగబడి నవ్వగలడు." అని వాజ్యస్తుతి చేసేవారు.

కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన 1945–51 మధ్య అర్ధ దశాబ్ద కాలం పాటు తెలంగాణ రైతులు సాయుధులై దోపిడి వర్గాలపై తిరుగుబాటు చేశారు. ఈ తిరుగుబాటులో కవులు, రచయితలు, కళాకారులు, ఎంతోమంది భాగస్వాములయ్యారు. యాదగిరి, సుద్దాల, తిరునగిరి, నాజర్, సుంకర, వాసిరెడ్డి, కాళోజీ, దాశరథి, కుందుర్తి, సోమసుందర్, గంగినేని వంటి కవులు తమ అక్షరాయుధాలతో నిలిచారు. కమ్యూనిస్టు ఉద్యమం ఉధృతంగా ఉన్న రోజుల్లో బొల్లిముంత పూర్తి సమయం పార్టీకి అంకితం చేశారు. పార్టీ పనుల మీద జగ్గయ్యపేటకు వెళ్లిరావడంతో అక్కడ తెలంగాణా పోరాటం గురించి వినడం, విషయాలు తెలుసుకోవడం జరుగుతూ ఉండేది. వాటితో ఉత్తేజితుడైన బొల్లిముంత ఇరవై ఏడేళ్ల వయసులో, తెలంగాణ పోరాటం ప్రారంభమైన ఒక సంవత్సరానికి, బొల్లిముంత 'మృత్యుంజయులు' నవల 1947 అక్టోబర్ 25న విడుదల చేశారు. ఒక రకంగా కవుల కవిత్వం కంటే కూడా ఆయన నవలాయుధమే ఆ రోజుల్లో గొప్ప విప్లవ విస్ఫోటనం అని చెప్పాలి. ఆ తర్వాత గంగినేని – ఎర్రజెండాలు, వట్టికోట – ప్రజల మనిషి, గంగు, మహీధర రామ్మోహనరావు – ఓనమాలు, మృత్యునీడల్లో, 'తిరునగిరి' 'సంగం' వంటి నవలలు వెలువడ్డాయి. అయితే అవన్నీ పోరాటం విరమించిన తర్వాత వెలువడ్డవి. దేశంలోని ఇతర ప్రాంతాల్లో రైతులు పంటలు పండించుకున్నందుకు శిస్తులు కడతారు. కాని, ఆనాడు తెలంగాణాలో శిస్తులు కట్టడానికే పంటలు పండించాల్సి వచ్చేది. ఆ దుర్భరస్థితిని సహజంగా చిత్రించింది ఈ'మృత్యుంజయులు' నవల. చచ్చేవాడికి రెండుచావులు ఉండవని, దినదినగండంగా ప్రతిరోజూ చస్తూ బతకడం కన్నా భావితరాల ఉజ్వల భవిష్యత్తు కోసం పోరాటంలో చావడమే మేలని జెండా పట్టి పోరాటంలో నేలకొరిగిన వీరుల వృత్తాంతాలే ఈ మృత్యుంజయులు నవల. పోరాటయోధుడు రావి నారాయణరెడ్డి ఈ నవలకు ముందుమాట రాశారు. నవలలోని ముఖ్యపాత్రలన్నీ పోరాటంలో మరణిస్తాయి. అంటే, వీరమరణం చెందుతాయి. బొల్లిముంత దృష్టిలో వారంతా చావును జయించినవారు, అంటే మృత్యుంజయులు అనే అర్థంతో రాశారు. తెలంగాణా పోరాటకాలంలో వెలువడిన తొలి నవలగా, ఒక చారిత్రక అవసరాన్ని గుర్తించి, ప్రజాపోరాటాన్ని నమోదు చేసిన నవలగా తెలుగు సాహిత్యంలో ఈ మృత్యుంజయులుకు సుస్థిర స్థానం ఉంటుంది. నాటి కమ్యూనిస్టు నాయకులు చంద్రం ఈ నవలను బొల్లిముంతతో ఆరుసార్లు తిరగరాయించారట. అంటే ఎంత ప్రయోగాత్మకమో, ఎంత సహజసిద్ధమో పాఠకులు ఊహించుకోవచ్చు.

సినీ రచయితగా బొల్లిముంత ప్రస్థానం చెప్పాలంటే, కమ్యూనిస్టు పార్టీ చీలిపోకముందే 1964లో ఆత్రేయ ప్రోత్సాహంతో బొల్లిముంత శివరామకృష్ణ ఆయనకు సహాయకుడిగా మద్రాసు వెళ్లారు. మొదట్లో తమిళ సినిమాలకు అనువాదాలు చేస్తుండేవారు. ఆత్రేయ స్వయంగా నిర్మించి, దర్శకత్వం వహించిన, 'వాగ్దానం'కు బొల్లిముంత తొలిసారి స్వయంగా మాటలు రాశారు. తిరుపతమ్మ కథకు సంభాషణలు రాసేనాటికి ఆ సినీ సంభాషణా చాతుర్యంలో మరింతపట్టు సాధించారు. ఆ తరువాత 'మనుషులు మారాలి' చిత్రం వారి సంభాషణలతో పెద్ద హిట్టయ్యింది. దాంతో, బొల్లిముంత మద్రాసులోనే స్థిరపడాల్సివచ్చింది. సుమారు 45 సినిమాలకు సంభాషణలు రాశారు. మధ్యలో కొన్ని కొన్ని పాటలు కూడా రాశారు. 'కాలం మారింది' సినిమాకు రాష్ట్రప్రభుత్వం అవార్డు, 'నిమజ్జనం' సినిమాకు జాతీయ అవార్డు లభించాయి. "రచనలు ఎప్పుడూ అభూత కల్పనల వైపుకాక, జీవిత వాస్తవాలవైపు సాగాలి... సమస్యలను చర్చించాలి... పరిష్కారమార్గాలను సూచించాలి... అవి యువరచయితలకి సరైనమార్గం నిర్దేశించాలి. అప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుంద" ని తరచూ చెబుతూ ఉండేవారు.

1955 మధ్యంతరం ఎన్నికల్లో రెండు పర్యాయాలు బొల్లిముంతపై హత్యాప్రయత్నం జరిగింది. భూపోరాటాల్లో పాల్గొన్నారు. జైలుశిక్షలు అనుభవించారు. అజ్ఞాతవాస జీవితం గడిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఆదేశం మేరకు 1967లో బందరు పార్లమెంటు నియోజకవర్గానికి పోటీచేసి ఓటమిపాలయ్యారు. అభ్యుదయ సాహితోద్యమంలో, ప్రజా సాంస్కృతికోద్యమాల్లో క్రియాశీలంగా వున్న బొల్లిముంత భీమవరంలో 1988 అక్టోబర్ 8, 9 తేదీలలో జరిగిన అరసం రాష్ట్ర 10వ మహాసభలో ప్రధాన కార్యదర్శిగా ఎంపికై గుంటూరులో 1992 నవంబర్ 14, 15 తేదీలలో జరిగిన 11వ మహాసభ వరకూ కొనసాగారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ఉపాధ్యక్షులుగా కూడా సేవలందించారు. బొల్లిముంత శివరామకృష్ణ జూన్ 7, 2005 న మరణించారు. ఆమరుసటి మాసం జూలై నెలలో 'ప్రజాసాహితి' పత్రిక బొల్లిముంత శివరామకృష్ణ సంస్మరణలో ప్రత్యేక సంచికను వెలువరించింది. నమ్మిన సిద్ధాంతాల పట్ల జీవితాంతం నిబద్ధత కలిగిన ఉత్తమ మానవతావాది బొల్లిముంత జీవితం, వ్యక్తిత్వం, సాహిత్యం నేటి తరానికీ, రానున్న తరాలకూ స్ఫూర్తిదాయకం.

**(జూన్ 7 బొల్లిముంత శివరామకృష్ణ వర్ధంతి )**

# లోగుట్టు పెరుమాళ్ళకెరుక

**(చిన్న కథ)**

"ఏమండీ! పెళ్ళి ఎంత వైభవోపేతంగా జరుగుతుందో చూశారా?"

"అవును పద్మా! ముఖ్యంగా ఆ సన్నాయి మేళం వింటున్నావా? ఎంత హృద్యంగా ఉంది? ఆ డోలు వాయించే అతనికి నిజంగా పద్మశ్రీ ఇవ్వాలి. ఈ బ్యాచీనే మన అమ్మాయి పెళ్ళికి కూడా పెట్టుకుందాం"

"తప్పకుండా వెళ్ళి అడ్రసు అడిగి తీసుకోండి" అనగానే సుధాకర్ వెళ్ళి వాళ్ళ ప్రక్కగా నిలబడ్డాడు. డోలు వాయించే అతను స్పృహలో లేకుండా వాయిస్తూ ఉంటే ప్రక్కన నిలబడ్డాడు. ఒక ఐదు నిముషాలకు స్పృహలోకి వచ్చిన డోలు వాయిద్య కళాకారుడికి విషయం చెబితే అడ్రసున్న కార్డు చేతికిచ్చి "ఉదయం 10 లోపు రండి ఎప్పుడొచ్చినా" అనేసి తన పనిలో నిమగ్నమయ్యాడు.

000

"ఏమండీ! ఈరోజు భజంత్రీలతో మాట్లాడతామని అన్నారు గుర్తుందా?" అంది పద్మ కాఫీ ఇస్తూ.

"గుర్తుంది. మీ తమ్ముణ్ణి రమ్మన్నాను" అంటూ ఉండగానే బావమరది రానే వచ్చాడు.

"రా! రా! ఆయన ఉదయం 10 లోపే రమ్మన్నాడు. ఆయనకేం పన్లో ఏంటో" అంటూ బయలుదేరదీశాడు హడావుడిగా.

అక్కడికి చేరుకునే సరికి 11 గంటలయింది. ఇదే యిల్లు అని గుర్తుపట్టి లోపలికి నడిచారు ఇద్దరూ. వరండాలో డోలు వాయిద్యం ఒక బల్లపై, నీలంరంగు బట్ట కప్పబడి ఉంది. లోపల హాల్లోకి వెళ్ళాలనుకుని తొంగి చూశారు. ఎవరో పెద్దావిడ టీవీ సీరియల్ చూస్తోంది. ఇంకో మధ్య వయసావిడ రెండు కాళ్ళూ టీపాయ్ పైనబెట్టుకోని మొబైల్లో ఏవో రీల్స్ చూసుకుంటోంది.

ఇంతలో షణ్ముగం టవల్ కట్టుకొని చేతిలో గరిటెతో వచ్చి "ఏమే ఉప్పూ కారం సరిపోయిందేమో కొంచెం చూడు..." అన్నాడు భార్యను. ఆమె మండిపడి "రోజూ వంట నువ్వే వండేడుస్తున్నావు కదా! ఆ మాత్రం తెలీదా? చిన్నవిషయానికి కూడా నన్ను డిస్టర్బ్ చెయ్యాలా!" అని మండి పడింది. వెంటనే వాళ్ళమ్మ "ఈ మనిషికి ఎన్నిసార్లు చెప్పినా అర్థం కాదమ్మా మనం పోయిన జన్మలో చేసుకున్న కర్మ ఇదంతా.." అంది. చిన్నబుచ్చుకున్న మొహంతో లోపలికి వెళ్ళాడు షణ్ముగం.

బయట ఎవరో ఉన్నారని గమనించిన షణ్ముగం భార్య "ఎవరండీ! రండి లోపలకి!" అని పిలిచింది. "మా అమ్మాయి వివాహం వచ్చే నెల్లో! భజంత్రీలు బుక్ చేసుకోవడానికి వచ్చాను" అన్నాడు. ఆమె లోపలికి వెళ్ళి అతన్ని పిలుచుకొచ్చింది.

"ఉదయాన్నే రమ్మన్నా గదా! ఈ సమయంలో వచ్చారేంటి? సరే చెప్పండి!" అన్నాడు విసుగ్గా. వివరాలు చెప్పాక డైరీలో అడ్రసు, తేదీలు రాసుకున్నాడు.

"మొత్తం పాతిక వేలు. అడ్వాన్సు 10 వేలు ఇవ్వండి" అన్నాడు. ఇవ్వబోతుండగా భార్యామణి వచ్చి టక్కున డబ్బులు షణ్ముగం చేతిలోనుండి లాగేసుకుంది. వెళ్ళొస్తాం అని చెప్పి బయటకు వచ్చారు ఇద్దరూ.


బయటకు వచ్చేసరికి ఇందాక డోలుపై కప్పి ఉన్న నీలిరంగుబట్ట గాలికి ఎగిరిపోయి ఉంది. సుధాకర్ దగ్గరగా వెళ్ళి చూసేసరికి ఒక వైపు డోలు వాయించే భాగంలో మధ్య భాగంలో ఆయన భార్య ఫొటో అంటించి ఉంది. అనుమానం వచ్చి రెండో వైపు చూసేసరికి వాళ్ళ అత్తగారి ఫొటో అంటించి ఉంది. "ఏమయింది బావా!" అన్న మాటలకు "షణ్ముగం అంత పెద్ద కళాకారుడెందుకయ్యాడో అసలు రహస్యం ఇప్పటికి బోధపడింది, ఇక పోదాం పద" అన్నాడు స్కూటరు వెనకాల కూర్చుని.



**– కిరణశ్రీ (91105 80418)**

## "భారతదేశము నా మాతృభూమి"

**పైడిమర్రి వెంకట సుబ్బారావు**



**శ్లో. పైడిమర్రిప్రతిజ్ఞాం చ సస్మార భారతః సదా ।**
**తస్య విస్మరణం నైవ యుక్తం భవతి సర్వథా ॥**

జనగణమన, వందేమాతరం రచయితల పేర్లు తెలిసినంతగా "భారతదేశము నా మాతృభూమి" అనే ప్రతిజ్ఞ రచించిన రచయిత పేరు చాలామందికి తెలియదు. పాతతరం వారు మాత్రమే మాత్రమే చెప్పగలుగుతున్నారు. జాతీయ గీతం, వందేమాతరం, సారే జహాసె అచ్ఛా! వంటి గీతాలు పాఠ్య పుస్తకాల్లో ప్రచురించినప్పుడు క్రింద ఆయా రచయితల పేర్లు ప్రచురిస్తూ, ప్రతిజ్ఞా రచయిత పైడిమర్రిని మరచిపోవడం జాతికి ద్రోహం చేయడమే! మన తెలుగు వాడు సైతం జాతీయ స్థాయికి తులతూగే గీతం వ్రాసినా ఆయన్ను పట్టించుకునే నాథుడే లేడు. కొన్ని పుస్తకాల్లో ఈ ప్రతిజ్ఞను ఇవ్వడం కూడా విస్మరిస్తున్నారు. జూన్ 10, 1916లో నల్లగొండ జిల్లా అన్నెపర్తి గ్రామంలో జన్మించిన పైడిమర్రి పలు భాషల్లో ప్రావీణ్యం సంపాదించి వెట్టిచాకిరి, భూస్వామ్య వ్యవస్థలకు వ్యతిరేకంగా అనేక రచనలను చేశారు. తన 18వ ఏటనే 'కాలభైరవుడు' కలం పేరుతో ఓ నవల, తరువాత 'ఉషస్సు కథలు' కథా సంపుటిని రచించారు. దేవదత్తుడు, తులసీదాస్, త్యాగరాజు మొదలైన పద్యకావ్యాలు, బ్రహ్మచర్యం, గృహస్థ జీవితం, స్త్రీధర్మం, ఫిరదౌసి, శ్రీమతి అనే నాటకాలు రాశారు.

ఈ ప్రతిజ్ఞను పైడిమర్రి 1962లో రచించారు. దాన్ని చదివి ఉప్పొంగిపోయిన సాహితీవేత్త తెన్నేటి విశ్వనాథంగారు నాటి విద్యాశాఖ మంత్రి పి.వి.జి రాజుగారి దృష్టికి తీసుకెళ్లారు. తరువాత బెంగళూరులో నిర్వహించిన కేంద్రవిద్యా సలహామండలి సమావేశంలో ఈ రచనను "జాతీయ ప్రతిజ్ఞ" గా ఆమోదించారు. ఈ ప్రతిజ్ఞ జనవరి 26, 1965 నుండి దేశంలోని ప్రతి పాఠశాలలో భావి పౌరుల గుండెల నిండా దేశభక్తిని, సోదరభావాన్ని నింపుతున్నది. తల్లిదండ్రులను, పెద్దలను గౌరవించడం వంటి గుణాలకు చిన్నతనంలోనే బీజం వేస్తున్నది. పైడిమర్రిని తగురీతిగా గుర్తించవలసిన అగత్యం ప్రతి భారతీయుడికీ ఉంది.

**(జూన్ 10, పైడిమర్రి సుబ్బారావు జయంతి)**

**– డా.వాసా భూపల్, 99490 37616**



## బాలుగారి విగ్రహావిష్కరణ

యస్. పి. బాలు గారూ!
నిన్ను కన్న తల్లిదండ్రులు
ఎందరు దేవుళ్ళకు దండాలు పెట్టారో కానీ
కోదండపాణి గారి అండదండలతోనే
కోరిన కోరికలన్నీ తీర్చుకొని
కోరుకున్న గమ్యాన్ని చేరుకున్నావు...

వేల కొద్ది గీతాలకు గాయకుడివై
వందల పాటల సంగీత దర్శకుడివై
కొందరికి తెరపై మాటలు పలికించి
నటుడిగా వివిధ పాత్రలలో రాణించి
"పాడుతా తీయగా "తో గాయకుల నందిస్తూ
ఆబాలగోపాలం అభినందనలందావు...

"సింహపురి "నుండి "చెన్నపురి "కే కాకుండా
అనేక దేశాల్లో గానామృతాన్ని పంచుతూ
తెలుగు వారి కీర్తికి వెలుగులు పెంచావు
అందుకే ఇలా అంటున్నా!
నెల్లూరు లో నీ కాంస్య విగ్రహావిష్కరణం
ఎల్లరికీ మదిలో మెదిలే గీత చరణం...


(04-06-2026న నెల్లూరులో బాలు విగ్రహావిష్కరణ సందర్భంగా )

**– బొగ్గరపు రాధాకృష్ణ మూర్తి (98854 81939)**

## డాలి నవ్వు

అంతకు రేయిని
అనామధేయుడు గాయపరిచాడు
ఒలికిన పచ్చివాసన్ని
గబ్బిలాలు ఎత్తుకెళ్ళి
గూళ్ళల్లో దాచుకుంటున్నాయి
రేయి కనుగుడ్డు
ఏదో చెప్పడానికి ప్రయత్నిస్తోంది
చెక్క కుర్చీపై కూర్చుని
నీషే వింటూవున్నాడు
తెగిన తల వద్ద
ఫ్రాయిడ్ ఊకొడుతున్నాడు
తన చేతిలో స్వప్న రుధిరం
తగలబడుతోన్న చెట్టు
అజంతా కేసి చూస్తూ దుఃఖిస్తోంది
గడియారం శవాల్ని మోస్తూనే ఉంది
మనుషులు పుడుతూనే ఉన్నారు
రంగులు వెలిసిన మేడలో
రెండు మూరల జాస్మిన్
ప్రేమికుణ్ణి నొప్పి లేకుండా
సమాధి చేస్తోంది
ప్రాణవాయువు తక్కువై మండూకం
చెరువు వద్ద శరీరాన్ని విసర్జించింది
కప్ప పార్థీవదేహాన్ని తీసుకెళ్ళడానికి
ఏలియన్లు వచ్చాయి
'చిత్రకొండ 'ఆధీనంలోని చెరువు
అంగీకరించదు
ఎర్ర ధూళి పూసుకుని గాలి
ఒంటెద్దు బండిపై వచ్చింది
కట్టపై కూర్చున్న 'మునెమ్మను '
కుశలమడిగి బొల్లిగిత్త తల నిమిరింది
పడమటి కనుమల్లో
అత్యాచారానికి లోనైన గాయం
చెట్టుకు వేలాడ్డానికి ప్రయత్నిస్తోంది
దుఃఖం వారించి
తన చెవిలో ఓ విషయం ఊది
రవీంద్ర భారతి లోకి నడిచింది
ఒడిలో తలల్ని పెట్టుకుని మొండాలు
కథలు చెబుతూ ఉన్నాయి
కలలు వింటూ ఉన్నాయి. ..

**– తెలుగు వెంకటేష్ (99853 25362)**





# డ్రగ్స్ తో జీవితాన్ని విచ్ఛిన్నం చేసుకోవద్దు

## మార్నింగ్ కాఫీ క్లబ్ అధ్వర్యంలో డ్రగ్స్ వద్దు... జీవితమే ముద్దు అవగాహన సదస్సు .. పాల్గొన్న సిఐ మురళీ కృష్ణ

**సృజనక్రాంతి/భీమవరం :** చిన్నతనంలోనే జీవితాన్ని విచ్ఛిన్నం చేసుకోవద్దని, "డ్రగ్స్ వద్దు... జీవితమే ముద్దు" అని భీమవరం రెండో పట్టణ సిఐ మురళీ కృష్ణ అన్నారు. జిల్లా పోలీసు శాఖ ఆదేశాల మేరకు మార్నింగ్ కాఫీ క్లబ్ అధ్వర్యంలో తాడిమళ్ళ వారి కాంప్లెక్స్ వద్ద మత్తు పదార్థాలకు దూరంగా ఉండా లంటూ అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మురళీ కృష్ణ మాట్లాడుతూ డ్రగ్స్ నిర్మూలన కోసం యువత నడుంకట్టాలని, మత్తు పదార్థాలపై పోరాటం మనతోనే ప్రారంభం కావాల న్నారు. డ్రగ్స్ కోసం మీ జీవితాన్ని మీ కుటుంబాన్ని మీ కలలను మత్తు కోసం తాకట్టు పెట్టవద్దని సూచించారు. క్లబ్ కన్వీనర్ బొండా రాంబాబు, కోట్ల నాని, జూలూరి రాజా,పిఆర్ఓ భట్టిప్రోలు శ్రీనివాసరావు మాట్లాడుతూ గంజాయి మత్తులో యువత జీవితాలను నాశనం చేసుకో వద్దని, మంచి ఆలోచనలు, అలవాట్లు చిన్నతనం నుంచే అలవర్చుకోవాలన్నారు. చెడు అలవాట్లు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కారుమూరి సత్యనారాయణ, కొత్త శ్రీనివాస్, బొండాడ సుబ్బారావు, గుండు సుమూర్తి, బొండాడ మనీష్ ,మానేపల్లి రవి చిన్నారావు, మానేపల్లి వెంకన్నబాబు,కారుమూరి బదరినాథ్, బొండా హనుమంతరావు, కొల్లేపర్ల సుబ్బారావు, కంచర్ల భాస్కరరావు, గుండు సుధీర్, బొడ్డు వాసు సభ్యులు పాల్గొన్నారు..



# సృజన క్రాంతి బిజినెస్

సృజన క్రీడ

సృజన సినిమా

Printed, published and owned by SHEELOJU YADAGIRI on behalf of RADHA PUBLICATIONS and Printed at DILIP OFFSET PRINTERS, Shop No.13-5-24/4, Beside Pillar No.1540, Beside Khadims Footwear, Durga Nagar, Dilsukhnagar, Hyderabad - 60. and published at RADHA PUBLICATIONS, H.No.2-74/13, Kethana Avenue, Road No.2, Opp : Vasanth Vihar, Fathullaguda, Tattiannaram, Hayathnagar, Rangareddy District 500068, Telangana State. Editor : SHEELOJU YADAGIRI. RNI No : TELTEL/2024/89270.
srujanakranti@gmail.com, Phone : 9140-31558127